క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తి



ఉంగుటూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఉంగుటూరు: ఉంగుటూరులో పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తయింది. సచివాలయం-1 పరిధిలో 660కు 600, సచివాలయం-2 పరిధిలో 406కు 378 పింఛన్లు పంపిణీ చేసినట్టు సెక్రెటరీ విజయ్ తెలిపారు. బెడ్ రెస్ట్ పేషెంట్లకు ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందిస్తున్నట్టు చెప్పారు.

దెందులూరులో..

దెందులూరు: దెందులూరు మండలంలో గురువారం సాయంత్రానికి 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ వీ.శ్రీలత తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలో 9,737 పింఛన్లకుగాను 8,900మంది లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. ఇప్పటివరకు పింఛను రూపంలో రూ.2 కోట్ల 69 లక్షల, 69వేల నగదును 20 సచివాలయాల్లో సిబ్బంది పంపిణీచేశారన్నారు.

రాటాలుకు ఎమ్మెల్యే పరామర్శ



రాటాలును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన పెదవేగి మండలం వీరంపాలెం గ్రామానికి చెందిన తాతా వెంకటేశ్వరరావు కుమారుడు రాటాలు అనే యువకున్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పరామర్శించారు. గురువారం రాటాలు ఇంటికి వెళ్లి అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అండగా ఉన్నానని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కొక్కిరపాడులో పోలీసు కవాతు



కొక్కిరపాడులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పెదపాడు : రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజల సహకారం అవసరమని ఎస్సై శుభశేఖర్ అన్నారు. పెదపాడు మండలం కొక్కిరపాడు గ్రామంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శుభశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున సమావేశాలు, సభలకు అనుమతులు తీసుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్, జడ్జి ఉమాసునంద

ఏలూరు (టూటౌన్): వన్‌స్టాఫ్ సెంటర్‌కు వచ్చే బాధిత మహిళలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, పోక్సో కోర్టు జడ్జి ఎస్ ఉమాసునంద అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని వన్‌స్టాప్ సెంటర్‌ను గురువారం వారు సందర్శించారు. అంతరింగిక శిక్షణలో భాగంగా వన్‌స్టాప్ సెంటర్‌ను జడ్జీలు సందర్శించారు. సెంటర్ పని విధానం, రికార్డులను పరిశీలించారు. బాధితుల వివరాలను ఆన్‌లైన్ చేసి, కేసుల కౌన్సిలింగ్, న్యాయసాయం, వైద్య సదుపాయాలు తదితర విషయాలపై ఆరా తీశారు. అక్కడ ఉన్న బాధితులకు న్యాయమూర్తుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో అడ్మిన్ నిర్మల పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.50 లక్షల విరాళం



దాత రాముకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు గురువారం వేరువేరుగా రూ. 1,50,232 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా ఏలూరుకు చెందిన నెమల రాము రూ. 1,00,116, లింగపాలెం మండలం కలరాయనగూడెంకు చెందిన ఎం.వెంకట సత్యన్నారాయణ రూ. 50,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాలను అందించి, శ్రీవారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

ప్రతి ఇంటికీ అభివృద్ధి జగన్ ఘనతే

ఎమ్మెల్యే వాసుబాబు



గుండుగొలనులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వాసుబాబు

భీమడోలు: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ అభివృద్ధిని అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గుండుగొలనులో గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో మా ఊరు సిద్ధం.. మేము సిద్ధం.. మా ఊరికి వాసన్న కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబుకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. మహిళలు హారతులు పట్టారు. అవ్వాతాతాలు, లబ్ధిదారులను వాసుబాబు ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందిన లబ్ధిని వివరించారు. గ్రామంలో తన హయాంలో 25 ఎకరాల భూమి కొనుగోలు చేసి వెయ్యి మందికి పట్టాలు అందించి సొంతింటి కలను సాకారం చేశానని, విద్యుత్ సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.4 కోట్లతో సబ్‌స్టేషన్ ఏర్పాటుచేశానని చెప్పారు. గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించామని, కోట్లాది రూపాయలతో సంక్షేమం, అభివృద్ధి పనులు చేశామని, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని వివరించారు. 1.50 లక్షల కెపాసిటీ గల మంచినీటి ట్యాంకు నిర్మిస్తున్నట్టు చెప్పారు. జగనన్న కాలనీ గ్రామంగా రూపొందిందన్నారు. మూడు దశాబ్దాల నాటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపానన్నారు. మరోసారి అధికారంలోకి రాగానే గ్రామంలో 10 ఎకరాల భూమి కొనుగోలు చేసి మిగిలిన వారికి సొంతింటి కలను సాకారం చేసే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామంలో మరో మంచినీటి చెరువు తవ్విస్తానన్నారు. రాష్ట్ర చరిత్రలో పేదల కోసం 126 సార్లు బటన్ నొక్కిన జగనన్న గెలుపు కోసం రెండు బటన్లు నొక్కి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు నౌడు వెంకట రమణ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువూరి సత్యనారాయణరాజు, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, సొసైటీ అధ్యక్షుడు నంద్యాల సుబ్బరాజు, రాష్ట్ర జాయింట్ కార్యదర్శి వగ్వాల అచ్యుతరామారావు, పార్టీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి రాజీలు, ఆర్‌బీకేల చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మగుంట రంగ, ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, సర్పంచులు పాము సునీతమాన్‌సింగ్, మానుకొండ నాగేశ్వరరావు, నాయకులు జహీర్, డోకల మురళీ, డోకల సుబ్రహ్మణ్యం, గుల్లిపల్లి సుధా, బొబ్బిలి శ్రీను, నల్ల శంకర్, నల్ల శ్రీను, గొటికల మురళీ, మద్రావు బాబు, వేములమంద రామరాజు, రామిశెట్టి శ్రీనివాస్, ఎంపీటీసీలు గంటా శ్రీనివాస్, ఆజామ్ , మద్దుల రాజా, నాగబోయిన కృష్ణ, సత్తా నర్సింహులు, అవుగడ్డి గంగాచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



భీమడోలు : గణేష్‌నగర్‌లో వాసుబాబుకు హారతి పట్టి స్వాగతిస్తున్న మహిళలు

కొత్తగూడెంలో 'మేమంతా సిద్ధం'



దెందులూరు : కొత్తగూడెంలో ప్రచారం చేస్తున్న కామిరెడ్డి నాని, లీలానవకాంతం గంగరాజు

దెందులూరు: కొత్తగూడెం గ్రామంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు మేమంతా సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, గ్రామ సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత కనక రాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, నాయకులు ఉదయభాస్కర్, సత్తిబాబు, సంతోష్, దిలీప్ ఇంటింటికి వెళ్లి ఐదేళ్లల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌లను గెలిపించాలని కోరారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ లబ్ధి



నాయుడుగూడెంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్

పెదపాడు: ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తెలిపారు. పెదపాడు మండలంలోని నాయుడుగూడెం గ్రామంలో నేను సిద్ధం.. మావూరు సిద్ధం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. గత ఐదేళ్లలో దెందులూరు నియోజకవర్గాన్ని అబ్బయ్యచౌదరి ఎంతో అభివృద్ధి చేశారని చెప్పారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా అబ్బయ్యచౌదరిని, ఎంపీగా కారుమూరి సునీల్ కుమార్ యాదవ్‌లను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ మారుమూడి కృపామణి, సర్పంచ్ సిద్దాబత్తిన జోజమ్మ, మారుమూడి సుధ, మారుమూడి సంతోషం, జంగం ఏలియా తదితరులు పాల్గొన్నారు.

నేడు నారాయణపురంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు: నారాయణపురంలో లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ బి.శ్రీరామ్ తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

బడుగు, బలహీన వర్గాలకు అగ్రతాంబూలం



టీడీపీ సీనియర్ నేత డోకల బాలమురళిని వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు, ఎంపీ అభ్యర్థి సునీల్ యాదవ్ తదితరులు

భీమడోలు: దేశ చరిత్రలోనే బడుగు, బలహీన వర్గాలకు 50 శాతం చట్టసభల సీట్లు కేటాయించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గుండుగొలనులో పార్టీ గ్రామ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు అధ్యక్షత గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ యాదవ్, ఏలూరు పార్లమెంట్ పార్టీ పరిశీలకులు గోరుముచ్చు గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. వీరి సమక్షంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ సీనియర్ నేత డోకల బాలమురళికి నాయకులు కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల్లో 50 శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కేటాయించి, వారికి అగ్రస్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ బడుగు బలహీన వర్గాల పార్టీగా చెప్పుకునే చంద్రబాబు తన రాజకీయ జీవితంలో అన్ని సీట్లు ఎప్పుడైనా కేటాయించారా అని ప్రశ్నించారు. సీఎం జగన్ బీసీలంటే బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదని బ్యాక్ బోను అని చెప్పి అందుకు అనుగుణంగా సీట్లు కేటాయించి వారిని గౌరవించారని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఏలూరు, నరసాపురం, రాజమండ్రి, అనకాపల్లి ఎంపీ స్థానాలను బీసీలకు కేటాయించిన సీఎం ఎవరైనా ఉన్నారా అంటే అది కేవలం జగన్‌మోహన్‌రెడ్డే అన్నారు. ఎంపీ అభ్యర్థి సునీల్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి గడపకూ మంచి చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు రాజకీయాలు, ప్రాంతాలకు, కుల, మతాలకు అతీతంగా నిస్వార్థంగా పథకాలను అందించిన ఏకైక సీఎం జగనన్న అన్నారు. ఏలూరు పార్లమెంట్ పరిశీలకులు గోరుముచ్చు గోపాల్ యాదవ్ మాట్లాడుతూ జగనన్నంటే నమ్మకమని, చంద్రబాబు మోసాలకు కేరాఫ్ అడ్రస్ అన్నారు. ప్రజలెవ్వరూ చంద్రబాబును నమ్మి మోసపోవద్దన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు వాసుబాబు, సునీల్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

నాడు – నేడు పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ-2 భాస్కర్‌కుమార్

భీమడోలు: పాఠశాలల్లోని నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత హెచ్ఎంలపై ఉందని ఎంఈఓ-1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు ఎంఆర్సీలో గురువారం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యాపరమైన అంశాలు, నాడు- నేడు పనుల ప్రగతి, పరీక్షల నిర్వహణ, పోలింగ్ బూత్‌ల సిద్ధం, విద్యా కానుక కిట్లు, విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శ్రీనివాసరావు అధ్యక్షతన సమీక్షించారు. ఎంఈఓ-2 ఏవీఎస్ఎన్ భాస్కర్‌కుమార్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి పాఠశాలల్లోని ఎన్నికల బూత్‌లను సంసిద్ధం చేయాలని, నాడు నేడు పథకంలో పాఠశాలల్లోని నిధులను ఖర్చుపెట్టాలని ఎంఈఓలు సూచించారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో పాఠశాలల్లో మంచినీరు సదుపాయం, ఎండీఎం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాలల చివరి పనిరోజు నాటికి నాడు నేడు పనులు పూర్తి చేయాలన్నారు. ఈనెల 6 నుంచి ఫైనల్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలన్నారు. సమ్మెటీవ్ అసెస్మెంట్, టోఫెల్ పరీక్షలు నిర్వహణలో ఉన్నతాధికారుల సూచనలు అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు బి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, సునీత, సీఆర్పీలు పాల్గొన్నారు.

టోపీలు, కళ్లజోళ్లకు పెరిగిన గిరాకీ



విజయరాయిలో పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న స్టాల్



వంగూరు ప్రధాన రహదారిలో టోపీలు, కళ్లజోళ్ల స్టాల్

పెదవేగి : వేసవి తాపానికి ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. ప్రయాణంలో ఎండ నుంచి రక్షణ పొందేందుకు టోపీలు, కూలింగ్ గ్లాసెస్ (కళ్లజోళ్లు), జేబురుమాళ్లను ప్రయాణికులు ఆశ్రయిస్తుండడంతో వీటికి గిరాకీ ఏర్పడింది. దీంతో 216, 16వ నెంబర్ జాతీయ రహదారులకు ఇరువైపులా చెట్ల కింద కళ్లజోళ్లు, టోపీలు స్టాల్స్ వెలిశాయి. ఫైబర్, ప్లాస్టిక్, గాజుతో తయారైన కళ్లజోళ్లు వివిధ ఆకృతులలో ఈ స్టాల్స్‌లో లభిస్తాయి. వీటి ధర రూ.55 నుంచి 500 వరకు పలుకుతున్నాయి. వీటికితోడు వివిధరకాల టోపీలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. చిన్నపిల్లలనుంచి పెద్దవారి వరకు వివిధ సైజులలో టోపీలు లభిస్తున్నాయి. సామాన్యులకు అందుబాటులో ధరలు ఉండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు ప్రయాణికులు మొగ్గుచూపుతున్నారు. రోజుకి 30 నుంచి 50 జతల కళ్లజోళ్లు, 40 టోపీలు విక్రయిస్తున్నట్లు విజయరాయి పెట్రోల్ బంక్ సమీపంలోని స్టాల్ నిర్వాహకుడు వెంకటేష్ తెలిపారు.

ఏడుగురు వలంటీర్ల రాజీనామా

కొయ్యలగూడెం: మండల పరిధిలో ఏడుగురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో అశోక్‌కుమార్ గురువారం తెలిపారు. పరింపూడి 3వ సచివాలయానికి చెందిన పూసల రాజేష్, కన్నాపురం ఒకటవ సచివాలయానికి చెందిన గోకారపు కోరేష్, సొంగ శ్రీను, సోంగా రాకేష్, కన్నాపురం రెండో సచివాలయానికి చెందిన గడ్డం చక్రధర్ రాజు, గవరవరం రెండో సచివాలయానికి చెందిన తగరం వివేక్, దిప్పకాయలపాడు సచివాలయానికి చెందిన కురసం మురళీకృష్ణ రాజీనామా చేసిన వారిలో ఉన్నారన్నారు.

చర్చి నిర్మాణానికి రూ.లక్ష విరాళం



సీఎస్ఐ చర్చి నిర్మాణానికి రూ.లక్ష అందిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: పోతునూరు గ్రామంలో చేపట్టిన చర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి రూ.లక్ష ఆర్థిక సాయం గురువారం కమిటీ సభ్యులకు అందజేశారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, పెదవేగి ఎంపీపీ తాతా రమ్యకుమార్, పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు, సీఎస్ఐ సంఘపెద్దలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ ముఖద్వార నిర్మాణానికి శంకుస్థాపన

దెందులూరు: కోస్తా జిల్లాల్లో భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతోన్న గాలాయగూడెం అచ్చమ్మపేరంటాలమ్మ తల్లి ఆలయ ముఖద్వార నిర్మాణానికి గురువారం అమ్మవారి ఆలయ కమిటీ సమక్షంలో పూజారి సర్వేశ్వరరావు, కృష్ణ కుమారి దంపతులచే శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణానికి గాలాయగూడెం గ్రామానికి చెందిన పూజారి లక్ష్మయ్య, సీతమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు రామారావు, సింహాచలం, వెంకటేశ్వరరావు, సర్వేశ్వరరావు, బాబురావు సంయుక్తంగా రూ.12 లక్షలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు దాతల కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

వెంకటరమణ వర్ధంతి

ఏలూరు (టూటౌన్): వడ్రంగి పనివార్ల సంక్షేమం, వృత్తి సంరక్షణకు అనేక పోరాటాలు చేసిన మహనీయుడు ఏలూరు వడ్రం పనివార్ల సంక్షేమం సంఘం అధ్యక్షుడు కెల్ల వెంకటరమణ అని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పొట్నూరి శివరాం, కెల్లా దుర్గాప్రసాద్‌లు కొనియాడారు. స్థానిక పవరుపేటలోని సంఘ భవనంలో గురువారం ఏర్పాటుచేసిన వెంకటరమణ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో వారు మాట్లాడారు. వెంకటరమణ ఆశయాల సాధనకు ప్రతి సంఘీయుడూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు



సభలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

గణపవరం: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు, గోనె సంచులు సిద్ధం చేశామని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు అన్నారు. గణపవరం మండలం చిలకంపాడులో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ ధాన్యం కొనుగోలులో అనుసరించాల్సిన పద్ధతులు, ధాన్యం నాణ్యతా పరిశీలన తదితర విషయాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ధాన్యం కొనుగోలు అత్యంత పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని, మండలంలోని 16 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఈనెల 5వతేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తాయని తెలిపారు. మండలంలో 48,500 మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఇందుకు అవసరమైన గోనె సంచులు సిద్ధంగా ఉంచామని తెలిపారు. జిల్లా సివిల్ సప్లయి మేనేజర్ శివరామ్ మాట్లాడుతూ మండలంలో ధాన్యం కొనుగోలులో ఎఫ్ఏక్యు ప్రమాణాలకు లోబడి ధాన్యం కొంటామన్నారు. మద్దతు ధరకన్నా బయటి మార్కెట్‌లో ఎక్కువ ధర లభిస్తే రైతులు బయట ధాన్యం అమ్ముకునే వెసులుబాటు కల్పించామని తెలిపారు. సమావేశంలో ఏడీఏ పి.మురళీకృష్ణ, తహసీల్దార్ రాంబాబు, ఎంఎల్ఓ దాసు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గంలో పయనించాలి





వ్యాఖ్యపరిచర్య చేస్తున్న నిర్వాహకులు ఫాస్టర్ బెంజిమన్, హాజరైన విశ్వాసులు

దెందులూరు: విశ్వాసం, నిరంతర ఆరాధనతో దేవుని దీవెనలు లభిస్తాయని స్థానిక మన్నా చర్చి ఫాస్టర్ బెంజిమన్ అన్నారు. స్థానిక ఎస్ఎంఆర్ నగర్‌లో మన్నా చర్చి ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు సువార్త మహాసభలు నిర్వహించారు. ఫాస్టర్ బెంజిమన్, ఛార్లెస్ పి.జాకబ్, బ్రదర్ కిరణ్‌పాల్, జాన్ మంగాచారిలు సందేశమిస్తూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కుటుంబపెద్దలు చిన్నారులతోపాటు కుటుంబమంతా దేవుని మార్గంలో పయనింపజేయాలన్నారు. తద్వారా కుటుంబాలు, గ్రామాలు, దేశం, ఆశీర్వాదం, అభివృద్ధి, మోక్షమార్గం లభిస్తుందని చెప్పారు. ఏసుక్రీస్తు సువార్త మహాసభలకు దెందులూరు, ఏలూరు, భీమడోలు, పెదవేగి, పెదపాడు, ఇతర మండలాల నుంచి విశ్వాసులు పాల్గొన్నారు.

ఓటర్లకు ప్రశాంత వాతావరణం కల్పించాలి



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

కామవరపుకోట: ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటర్లకు సదుపాయాలు కల్పించాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గురువారం మండలంలో ఆమె ఆకస్మిక పర్యటన చేశారు. ముందుగా మండలంలో కొత్తూరులో గల ఆర్అండ్‌బీ బంగ్లా సమీపంలో ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్టును ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం మండలంలో సమస్యాత్మకంగా గుర్తించిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి, అక్కడ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటుచేసిన బూత్‌లను, సదుపాయాలను పరిశీలించారు. ఈ కేంద్రంతోపాటు మండలంలో తడికలపూడి, ఆడ మిల్లి, జలపవారిగూడెం గ్రామాల్లో సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించమని, వాటి వద్ద తగిన బందోబస్తు ఏర్పాట్లు చేస్తామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రశాంతి మాట్లాడుతూ ఎన్నిక లు జరిగే ప్రాంతాల్లో వెబ్ కాస్టింగ్, పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలలో సీసీ కెమెరాల నిఘా, ప్రత్యేక సాయుధ బలగాల పహారా ఉంటుందని ఆమె తెలిపారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భీమడోలు: గుండుగొలను శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ మూడో వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఆలయ ట్రస్ట్ చైర్మన్ వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు ఆధ్వర్యంలో శ్రీశ్రీనివాసుల విజయగోపాలాచార్యులు నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు రామానుజం మంగపతి ఆచార్యులు స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివార్ల ను విశేషంగా అలంకరించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృతాలతో మండపారాధన, అభిషేకాలు, తులసీ బిల్వదళాలతో పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో శ్రీసీతారామస్వామి ఆల య కమిటీ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగారాజకుమా ర్, ఈఓ కేఎం వంశీ, భక్తులు, పెద్దలు పాల్గొన్నారు.